క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

బలిజిపేట: ఎంపీపీ నాగమణి అధ్యక్షతన బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ భానుమూర్తి తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. మండలస్థాయి అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని పేర్కొన్నారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు



హడ్కో కాలనీ రోడ్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి గ్రామంలో భోగితల్లి అమ్మవారి జాతర నిర్వహించనున్న సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనుల్లో భాగంగా గురువారం హడ్కో కాలనీ, హౌసింగ్ కాలనీ,పెదభోగిలి ప్రధాన రహదారుల్లో యంత్రాలతో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. ఈ మేరకు సర్పంచ్ జె.తేరేజమ్మ మాట్లాడుతూ అమ్మవారి జాతరకు పలుగ్రామాలనుంచి వేలాదిమంది భక్తులు వస్తున్నారని తెలియజేశారు. భక్తుల సేవార్థం అమ్మవారి జాతర ఉత్సవకమిటీ, గ్రామ పెద్దల సూచనల మేరకు ఇప్పటికే గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు విద్యుద్దీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈఓ వెంకటరావు ఆధ్వర్యంలో నాలుగు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని తెలియజేశారు.

లక్ష్మీనృసింహ స్వామికి పంచామృతాభిషేకం




భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో భక్తులు గురువారం పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామివారి పర్వదినం కావడంతో వందలాది మంది భక్తులతో అభిషేకాలు గావించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు కోరిన కోర్కెలు తీరుతాయన్న ఆశతో పూజలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అలాగే సంతానం లేనివారు ప్రత్యేక పూజలు చేయడం వల్ల సంతాన ప్రాప్తి కలుగుతుందన్న నమ్మకం భక్తులకు ఉందన్నారు. ఈ నేపథ్యంలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేస్తారని తెలిపారు. దూర ప్రాంతాలనుంచి ఆలయానికి వచ్చి అభిషేకంలో పాల్గొన్న భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

ఉపాధి పనుల పరిశీలన

సీతానగరం: మండలంలోని వేతనదారులు ఉపాధి పనులు చేయడానికి వాతావరణం అనుకూలించడంతో వేతనాలు గిట్టుబాటయ్యే విధంగా చేపట్టాలని డ్వామా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు అన్నారు. ఈ మేరకు గురువారం బూర్జ, జోగింపేట గ్రామాల చెరువుల్లో వేతనదారులు చేస్తున్న పనులను పరిశీలించారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా వేతనాలు గిట్టుబాటయ్యే విధంగా జనులు జరగాలని సూచించారు. అనంతరం లక్ష్మీపురం సచివాలయాన్ని సందర్శించి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల హాజరును పరిశీలించారు.

విద్యాకానుక శ్యాంపిల్ మెటీరియల్ అందజేత



శ్యాంపిల్ కిట్లను అందజేస్తున్న ఇన్‌చార్జి డీఈఓ వెంకటేశ్వరరావు

పార్వతీపురం టౌన్: జగనన్న విద్యాకానుక నాల్గవ సంవత్సరానికి సంబంధించి జిల్లాకు వచ్చిన శ్యాంపిల్ మెటీరియల్‌ను మండల పాయింట్లకు ఇన్‌చార్జి డీఈఓ పి. వెంకటేశ్వరరావు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శ్యాంపిల్ మెటీరియల్‌ను మండల స్టాక్‌పాయింట్ల వద్ద ప్రదర్శనకు ఉంచి మండల ఏపీఎంలు, సచివాలయ సిబ్బంది క్వాలిటీ చెక్‌చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు, పేరెంట్స్ కమిటీ సభ్యులకు చూపించాలని కోరారు. శ్యాంపిల్ మెటీరియల్‌లో మూడు రకాల స్కూల్‌బ్యాగ్‌లు, నాలుగు రకాల బెల్ట్‌లు, షూలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



గ్రామంలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని అలజంగి జోగారావు అన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షాన నిలుస్తున్నారన్నారు. పార్వతీపురం మండలం బందలుప్పి గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఆత్మీయ స్వాగతం పలికారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. అమ్మ ఒడి వచ్చిందా, రైతు భరోసా వచ్చిందా, పింఛన్ ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారా అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయో? లేదో? అర్హులకు ఏదైనా అన్యాయం జరుగుతోందా? తదితర విషయాలు తెలుసుకునేందుకే తాము వచ్చామని వివరించారు.

లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సచివాలయాలు ఆయా గ్రామాల పరిధిలో ఉండడంవల్ల ప్రజలకు కూడా తమ సమస్యలను వెంటనే తెలియజేసి పరిష్కారం పొందుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తోందన్నారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నిధులను కేటాయించిందని, వాటి ద్వారా పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన చేయనున్నట్లు తెలిపారు.

ప్రతిపక్షాలవి అర్థంలేని ఆరోపణలు

ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం అందజేస్తూ పేదల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తున్న తీరును ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు కొందరు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీజీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథ రావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్,స్థానిక సర్పంచ్ యాళ్ల ప్రమీల పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివన్నాయుడు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన

మండలంలోని బందలుప్పి గ్రామంలో తాగునీటి సమస్య ఉందని తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పథకాలకు నిధులు కేటాయిస్తోందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనుల నివేదికను ప్రభుత్వానికి పంపించామని ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసిందని చెప్పారు.

పేదల సొంతింటి కల సాకారం



జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ లే అవుట్‌లను వివరించే పత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పేద, మధ్యతరగతి తదితర అన్నివర్గాల ప్రజల సొంతింటి కల సాకారమవుతున్నదని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. సాలూరు పట్టణంలో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ లే అవుట్ ప్లాట్ల విక్రయ కార్యక్రమాన్ని పట్టణంలోని శ్రీ సీతారామ ధర్మశాలలో ఆయన ప్రారంభించారు. ఈ క్రమంలో లే అవుట్ ప్లాట్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో నిరుపేదల కోసం 35 లక్షల ఇళ్ల పట్టాలను జగన్‌మోహన్‌రెడ్డి మంజూరుచేశారని తెలిపారు. ఇది దేశంలో ఓ చరిత్ర అని పేర్కొన్నారు. మధ్య తరగతి వర్గానికి చెందిన ఉద్యోగులు, నిరుద్యోగులు, వ్యాపారస్తులు తదితర వర్గాల కోసం రాయితీపై,తక్కువ ధరకు ఇళ్ల పట్టాలను స్మార్ట్ టౌన్‌షిప్‌ల ద్వారా అందిస్తున్నారని వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని మౌలిక సదుపాయాలతో ఈ టౌన్‌షిప్‌లు ఏర్పాటుచేస్తున్నారన్నారు. వీటిపై టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను ఆయన ఖండించారు. ప్రజలకు మేలు చేయాలనే దృఢ సంకల్పంతో పాలన చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని ప్రజలు నిశ్చయించుకున్నారన్నారు. అంతకుముందు స్మార్ట్ టౌన్‌షిప్‌ను విజయనగరం జేసీ మయూర్ అశోక్ పరిశీలించారు.కార్యక్రమంలో బుడా చైర్‌పర్సన్ ఇంటి పార్వతి, బుడా వైస్‌చైర్మన్ విజయనగరం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, బుడా ఏపీఓ కుమార్, మున్సిపల్ కమిషనర్ శంకరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు. ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి పాల్గొన్నారు.

నూతన వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



వలంటీర్లకు నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఇటీవల ఖాళీ అయిన వలంటీర్ల స్థానాలను ఎంపీడీఓ భర్తీ చేయగా ఎమ్మెల్యే జోగారావు గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నియమితులైన వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలోగల 50 కుటుంబాలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందేలా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ ఆశయ సాధనకు అనుగుణంగా పనిచేయాలని సూచిస్తూ నూతనంగా విధులు చేపట్టబోతున్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.విజయలక్ష్మి, మండల ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జోగారావును కలసిన దేవాదాయశాఖ ఏఈ

జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన డీవీవీ సురేష్‌కుమార్ గురువారం ఎమ్మెల్యే అలజంగి జోగారావును స్థానిక క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలశారు. నియోజకవర్గం పరిధిలో చేపట్టిన పలు దేవాలయాల నిర్మాణం పనుల పురోగతిపై ఆరాతీశారు. వాటి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చేయాలని ఆయనకు సూచించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ



అట్రాసిటీ కేసుపై విచారణ జరుపుతున్న జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ స్పెషల్ డీఎస్పీ మురళీధర్

భామిని: మండలంలోని చిన్నదిమిలి గ్రామంలో నమోదైన అట్రాసిటీ కేసుపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పార్వతీపురంమన్యం జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ స్పెషల్ డీఎస్పీ మురళీధర్ గురువారం విచారణ చేపట్టారు. తహసీల్దార్ నీలాపు అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ విచారణలో అట్రాసిటీ కేసు నమోదుకు కారణమైన భూ వివాదానికి సంబంధించిన, ఇరు వర్గాలతో సదరు అధికారులు మాట్లాడారు. వివాదానికి గల కారణాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ తోట రామ్మోనరావు, బత్తిలి ఎస్ఐ అమ్మనరావు పాల్గొన్నారు.

తాగి పట్టుబడితే జైలుకే..



వాహనదారుడికి డ్రంక్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్ఐ అమ్మనరావు

భామిని: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలుకేనని బత్తిలి ఎస్ఐ యతిరాజుల అమ్మనరావు హెచ్చరించారు. భామిని, బత్తిలి ప్రాంతాల్లో గురువారం వాహన తనిఖీలు చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం తాగి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు ప్రమాదాలు కూడా ఎక్కువగా మద్యం మత్తులో జరుగుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

గిరిజన గూడల్లో అధికారుల దర్యాప్తు



బంద్రసింగి గూడలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

భామిని: మండలంలోని తివ్వాకొండల్లో ఉన్న గిరిజన గూడల్లో అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇటీవల సీతంపేట మండల కేంద్రంలో జరిగిన స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమంలో తివ్వాకొండల్లోని రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న 12 గిరిజన గూడలకు చెందిన వారు తమ గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం ఆయా ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు వారు ఎంతకాలం నుంచి అక్కడ ఉంటున్నారు, గతంలోని ప్రభుత్వాలు అక్కడ ఏయే మౌలిక సదుపాయాలు కల్పించారన్న అంశాలపై ఆరాతీశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణమూర్తి, వీఆర్ఓలు గోపాల్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

సీతంపేట: మండలంలోని మల్లికాలనీ, కుశిమి పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ సత్యం గురువారం పరిశీలించారు. అనంతరం వేతనదారులకు పలు సూచనలు చేశారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో పనిచేయాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూసుకోవాలన్నారు. సిబ్బంది కూడా పనిలోకి వచ్చిన వారికి మస్తరు వేయాలన్నారు.

‘జగనన్నకు చెబుదాం’ సచివాలయంలో నిర్వహించాలి



జగనన్నకు చెబుదాం సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: సచివాలయాల్లో ఈ నెల 9నుంచి ప్రారంభం కానున్న జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరించడానికి ఉద్యోగులు సమాయత్తం కావాలని ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం అమలుపై పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం ప్రజలకు సచివాలయాల ద్వారా పారదర్శకంగా మెరుగైన సేవలందించడానికి నూతనంగా జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని అమలు చేసిందన్నారు. ఈ మేరకు మండలంలోని 21 సచివాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ సచివాలయంలో ఉండి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. జగనన్నకు చెబుదాం స్పందన దరఖాస్తులలో అంశాలను పరిశీలించి సత్వరమే పరిష్కరించడానికి లేదా ఎన్నిరోజుల్లోగా పరిష్కారం జరుగుతుందో అర్జీ దారుకు నమ్మకం కలిగే విధంగా వివరించాలని, అర్జీదారులు సంతృప్తి చెందని పక్షంలో సమస్య ఏవిధంగా పరిష్కారమవుతుందో తెలియజేయాలని సూచించారు. అలాగే సచివాలయ ఉద్యోగులు విధిగా ప్రభుత్వం కేటాయించిన దుస్తులతో విధుల్లో పాల్గొవాలని, సమయ పాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలందించడానికి సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండాలని సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించే సమయంలో మండలస్థాయి అధికారులు పర్యవేక్షణకు వచ్చిన సమయంలో తగురీతిలో సమస్యలను వివరించి శాఖల వారిగా చర్చించి సమస్యలను ఎక్కడకక్కడే పరిష్కరించే విధంగా విధులు నిర్వహించి ప్రభుత్వానికి మంచిని చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్నారుల వివరాలు నమోదు చేయాల్సిందే

- డీఐఓ డాక్టర్ జగన్‌మోహన్ రావు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: చిన్నారుల ఆరోగ్య వివరాలు తప్పనిసరిగా రికార్డుల్లో నమోదు చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఈఓ) డాక్టర్ జగన్ మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్ఆర్‌సీ, ఎస్ఎన్‌సీయూ యూనిట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఆర్‌సీలో అడ్మిట్ అయిన చిన్నారుల వివరాలను పరిశీలించి పిల్లల తల్లులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. ప్రతి నెల వివరాల నివేదికను అందజేయాలని సిబ్బందికి సూచించారు. నవజాత శిశువుల్లో శ్వాసకోశ వ్యాధులు, బరువు తక్కువగా జన్మించిన శిశువులకు కామెర్లు, ముందస్తుగా ప్రసవం గుర్తిస్తే వెంటనే వైద్యసిబ్బంది ఎస్ఎన్‌సీయూకు రిఫర్ చేయాలని ఆదేశించారు. పోషకాహార లోపం, బరువు తక్కువ పిల్లలను గుర్తిస్తే ఎన్ఆర్‌సీ కేంద్రాలకు రిఫర్ చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలను వైద్యాధికారులు, సిబ్బంది సందర్శించి పై కారణాలు గుర్తిస్తే ఎన్ఆర్‌సీ కేంద్రాలు, ఎస్ఎన్‌సీయూ కేంద్రాలకు రిఫర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు..

పిల్లలకు విజ్ఞానం, వినోదం, వికాసం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న రచయిత గంటేడ గౌరునాయుడు

పార్వతీపురంటౌన్: పిల్లలకు విజ్ఞానం, వినోదం, వికాసం అవసరమని అది చుట్టూ ఉన్న సమాజంలో కరువైందని కవి, రచయిత గంటేడ గౌరునాయుడు అన్నారు. ఈ మేరకు గురువారం ఐద్వా, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేసవి వినోదం పేరుతో పట్టణంలోని ఏర్పాటు చేసిన చిల్డ్రన్ క్లబ్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ సరళీకరణ విధానాల అభివృద్ధిలో పిల్లలే సూత్రధారులుగా నిలుస్తున్నారన్నారు. వారి మనసులను ఆకట్టుకునేలా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. పుస్తకాల కన్నా సెల్‌ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లపై చిన్నారులు ఎక్కువ మొగ్గు చూపుతున్నారని, మరికొంతమంది పిల్లలు వారి జీవనం, కుటుంబ పరిస్థితి వల్ల చెడు అలవాట్లకు గురవుతున్నారన్నారు. పిల్లల్లో చైతన్యం కల్పించి వాటన్నింటికీ దూరంగా ఉండేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు రెడ్డి శ్రీదేవి, యూటీఎఫ్ సహాయ కార్యదర్శి మురళీమోహన్, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి జ్యోతి, వి.ఇందిర, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అనుపోత్సవానికి గట్టి బందోబస్తు

- సీఐ కృష్ణారావు



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణారావు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి నుంచి సీతానగరం మార్కెట్‌వరకూ తిరువీధి సిరిమాను తిరిగే సమయంలో గట్టిబందోబస్తు ఏర్పాటు చేస్తామని సీఐ కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు గురువారం పెదభోగిలి నుంచి-శివాలయం మీదుగా సీతానగరం మార్కెట్ హనుమాన్ జంక్షన్ వరకూ సిరిమానోత్సవం నిర్వహించే రూట్ మ్యాప్‌ను ఆయనతో పాటు ఎస్సై నీలకంఠం, సిబ్బంది సర్వే చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలోని పెదభోగిలి గ్రామ దేవత భోగితల్లి అమ్మవారి జాతరను పురస్కరించుకుని సీతానగరం, అప్పయ్యపేట, బుడ్డిపేట, జోగింపేట పెదభోగిలి గ్రామాల్లో ఈ నెల 8,9,10 తేదీలలో జాతర జరుగుతుందని లక్షమంది వరకూ భక్తులు పాల్గొంటారని అన్నారు. జాతర ప్రశాంతంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ సభ్యులకు వాహన చోదకులు, ప్రయాణికులు సహకరించాలని కోరారు. అలాగే సిరిమాను పెదభోగిలి నుంచి బయలు దేరినప్పటి నుంచి తిరుగుముఖం పట్టేంతవరకూ ఉత్సవకమిటీ సభ్యులు ఇచ్చిన సూచనల మేరకు పోలీసువారు అమలు చేసే ఆంక్షలను విధిగా పాటించి అమ్మవారిని దర్శించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు అరవింద్‌కుమార్, హరి గోపాలరావు, ఆర్వీ కిశోర్‌కుమార్, పి.పైడిపినాయుడు, ఎస్.రామారావు, బి.శ్రీనివాసరావు, పి రామారావు, జె.గరికయ్య, ఎం.విశ్వేశ్వరరావు, ఏవీ సత్యన్నారాయణ, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

నాన్ టింబర్ ప్రొడక్ట్స్ తయారీపై శిక్షణ

సీతంపేట: మండల కేంద్రంలోని వైటీసీలో నాన్ టింబర్ ప్రొడక్ట్స్ తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. దాదాపు 50 రోజుల పాటు పల్సస్ కల్టివేటర్ శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 18–34 సంవత్సరాల వయసు మధ్య ఉన్న వారు శిక్షణకు అర్హులని, ఆసక్తి ఉన్న అభ్యర్థులంతా పదో తరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంక్ అకౌంట్ బుక్ జిరాక్స్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు వైటీసీ మేనేజర్ ఫోన్ నంబర్ 7032060773ను సంప్రదించాలన్నారు.

రామమందిరం నిర్మాణానికి భూమిపూజ



రామమందిరం నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కురుపాం:

మండల కేంద్రంలోని శివ్వన్నపేటలో రామమందిరం నిర్మాణానికి సర్పంచ్ గార్ల సుజాత, కళింగ వైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొదంగోళ్ల గౌరీశంకరరావు కలిసి గురువారం భూమిపూజ చేశారు. అయల నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మొత్తం రూ.60 లక్షలతో మందిరం నిర్మిస్తున్నామని, విరాళాల సేకరణ కూడా జరుగుతోందని, తూరుబిల్లి ఆనందరావు రూ.5 లక్షల విరాళం ప్రకటించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బరాటం గుంపస్వామి, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె.వి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

సీతానగరం: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు నిరసనగా సీపీఎం మండల కార్యదర్శి ఆర్.ఈశ్వరరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు రాష్ట్ర రహదారిపై హనుమాన్ జంక్షన్ వద్ద గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మాట్లాడుతూ ఎంతో మంది నిరుద్యోగులు, ప్రజలు పోరాటం చేసిన సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారి వర్గాలకు విక్రయించి ఉద్యోగ, కార్మికుల హక్కులను హరించడానికే కుట్ర చేస్తోందని ఆరోపించారు. పరిశ్రమను విక్రయించడానికి నిరసనగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అప్పటికి సమస్య పరిష్కారం కాని పక్షంలో క్షేత్ర స్థాయిలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో పలు కర్మాగారాలు మూతపడడం వల్ల ఉద్యోగులు, కార్మికులు జీవనోపాధికి అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం, వ్యవసాయ కార్మికసంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా , మండల నాయకులు ఆర్.లక్ష్మునాయుడు, ఆర్.రమణమూర్తి, జి వెంకటరమణ, రామలక్ష్మి పాల్గొన్నారు.